క్లుప్తంగా

నేడు బహిరంగ వేలం

రేగొండ: మండలంలోని కొడవటంచ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో నేడు (శనివారం) బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ మహేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయం నందు మార్చిలో నిర్వహించే బ్రహ్మోత్సవాల సందర్భంగా కొబ్బరికాయలు, పూజ సామగ్రి, కొబ్బరి ముక్కలు పొగుచేసుకును హక్కు, లడ్డు, పులిహోర అమ్ముకొను హక్కునకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల టెండరు దారులు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

విద్యుత్ మోటారు చోరీ

రేగొండ: మండలంలోని దుంపిల్లపల్లి గ్రామానికి చెందిన బోయిని రాజు భాగిర్థిపేట గ్రామ శివారులోని ఎర్రమ్మకుంట చెరువు వద్ద ఉన్న పొలంలో విద్యుత్ మోటార్‌ను బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. గురువారం ఉదయం పొలానికి నీరు పెట్టిందుకు వెళ్లగా విద్యుత్ వైరు కట్ చేసి, మోటార్ చోరీ చేసి ఉండటం బాధిత రైతు గమనించాడు. రూ.40 వేలు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈమేరకు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రైతు తెలిపారు.

చేయూత

భూపాలపల్లి రూరల్: మండలంలోని గొర్లవీడు గ్రామం ఆర్యవైశ్య కుటుంబానికి చెందిన నిరుపేద దొంతుల లింగమూర్తి ఇటీవల జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో జారిపడటంతో కాలు విరిగింది. దీంతో అతడి కుటుంబ పరిస్థితిని గుడాడ్‌పల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్ వాసవీ హెల్పింగ్ హ్యాండ్స్ వరంగల్ వాళ్లకు తెలిపాడు. దీంతో వారు స్పందించి, శుక్రవారం రూ.25 వేల ఆర్థిక సాయం అందించారు.

సన్మానం



టేకుమట్ల: బోధనా పాఠ్యాంశం బయాలజీ అయినా తెలుగు భాషపై ఉన్న మక్కువతో జీవన పోరాటం అనే పంచ శతకాన్ని రచించి, ఇటీవల ఆవిష్కరించి ఎంతో మంది తెలుగు పండితులకు ఆదర్శంగా నిలిచిన మండల విద్యాధికారి చిదిరాల సుధాకర్‌ను శుక్రవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో టేకుమట్ల, చిట్యాల, మొగుళ్లపల్లి తెలుగు పండితులు గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలుగు భాషపై ఉన్న శ్రద్ధ జీవన పోరాటం అనే పంచ శతకంలో చూపించారని, అద్భుతమైన రచనతో పొందుపర్చిన ఆయన కవితా శైలీ తెలుగు భాషా పండితులకు ప్రేరణ అని అన్నారు. ఆకారపు భుజేంద్రచారీ, మేకల సదయ్య, సందగాల కిషన్, పొనగంటి సదయ్య, నల్ల సత్యాదేవి, బత్తిని అశోక్, రవీందర్‌రెడ్డి, కానుగుల రఘుపతి, రమాదేవి, సుధాకర్, రవీందర్, శ్రీధరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక


సంతోష్, అధ్యక్షుడు


రవీందర్, ప్రధాన కార్యదర్శి

భూపాలపల్లి రూరల్: తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ నూతన జిల్లా కమిటీని జిల్లా కేంద్రంలో శుక్రవారం ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పావుశెట్టి శ్రీనివాస్ కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా ఎడ్ల సంతోష్, ప్రధాన కార్యదర్శిగా దొమ్మటి రవీందర్, ఉపాధ్యక్షులుగా బండారి రాజు, గట్టు రవీందర్, జనార్దన్, సంయుక్త కార్యదర్శులుగా పల్నాటి రాజు, కడపాక రవి, బొచ్చు భూపాల్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా తిరుపతి, కోశాధికారిగా సంగెం శేఖర్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారికి నియామక పత్రాలు అందజేశారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



ములుగు రూరల్: పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌లాల్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎంబీబీఎస్ విద్యార్థులకు కుటుంబ దత్తత కార్యక్రమం జాకారంలో నిర్వహించారు. విద్యార్థులు గ్రామంలోని ఇంటింటికీ తిరిగి ప్రజల ఆరోగ్యం, మంచి నీటి వసతి, పరిసరాల పరిశుభ్రత, వసతి విషయాలపై వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మి, ఎస్‌పీఎం డిపార్టుమెంట్ డాక్టర్ శివాని, డాక్టర్ భవాని, తిరుపతయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆశావహుల జేబుకు చిల్లు!

- పల్లెపోరులో ఏర్పడిన జాప్యంతో అవస్థలు
- ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పాట్లు
- నిత్యం దావత్‌లతో తడిసి మోపెడు



కొత్తపల్లిగోరి గ్రామపంచాయతీ కార్యాలయం

రేగొండ: గ్రామ పంచాయతీ ఎన్నికల పోరు డైలీ సీరియల్‌గా సాగుతూ వస్తోంది. దీంతో ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఆశావహుల్లో కలవరపాటు మొదలైంది. ప్రభుత్వం పల్లె పోరును దసరా పండుగ తర్వాత నిర్వహిస్తామని తెలిపి, అనంతరం చోటు చేసుకున్న పరిణామాలతో సంక్రాంతికి వాయిదా వేసింది. సంక్రాంతి ముగిసి నెల గడిచినా.. ఎన్నికల షెడ్యూల్ విడుదల కాలేదు. దీంతో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఆశావహులు నానా అగచాట్లు పడుతున్నారు. నిత్యం దావత్‌లతో ఖర్చు తడిసి మోపెడవుతుందని వాపోతున్నారు. రేగొండ మండలంలో 23 గ్రామపంచాయతీలు, కొత్తపల్లిగోరి మండలంలో 16 గ్రామపంచాయతీలు ఉన్నాయి. అందులో సర్పంచ్ పదవికి పోటీ చేసే వారి సంఖ్య గణనీయంగానే ఉందని ప్రాథమిక అంచనా.

గ్రూప్ రాజకీయాలతో పరేషాన్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో పాటు, స్థానికంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేనే ఉండటంతో ఆ పార్టీ బలంతో పోటీ చేసేందుకు ఆశావహులు ఆసక్తి చూపుతున్నారు. అందుకు అనుగుణంగానే గ్రూపులుగా ఏర్పడ్డారు. అదిగో.. ఇదిగో ఎన్నికలంటూ ప్రభుత్వ ప్రకటనలతో గ్రామాల్లో వేడెక్కిన వాతావరణం.. బీసీ రిజర్వేషన్లు తేలాకే ఎన్నికలపై నిర్ణయిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలపడంతో ఒక్కసారిగా స్తబ్దుగా మారింది. రేగొండ, కొత్తపల్లిగోరి మండల కేంద్రంతోపాటు జగ్గయ్యపేట, చిన్నకోడెపాక, భాగిర్థిపేట, తిరుమలగిరి, రంగయ్యపల్లి, రామన్నగూడెం, పొనగండ్ల, రేపాక, దమ్మన్నపేట వంగి పెద్ద గ్రామ పంచాయతీల్లో అధికార పార్టీ నాయకులు రెండు నుంచి మూడు వర్గాలుగా విడిపోయి లాబియింగ్‌లు మొదలుపెట్టినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. నిత్యం ఏదో ఒక కాలనీలో కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేస్తూ మనకే టికెట్ అంటూ ప్రచారాలు మొదలుపెట్టారు. గ్రామాన్ని సక్రమంగా పాలించే మంచి నాయకుడు ఉంటే గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారనే అభిప్రాయం స్థానికంగా వ్యక్తం అవుతుంది.

ఇక నువ్వే సర్పంచ్..

సర్పంచ్ ఆశావహులు కొన్ని నెలలుగా మద్దతుదారులను వెంటపెట్టుకుని స్థానికంగా హల్‌చల్ చేస్తున్నా రు. మధ్యాహ్నం వెంట తిరగడం.. రాత్రికి మ ద్యం తాగడం వంటి కార్యక్రమాలు పల్లెల్లో జోరుగా సాగుతున్నాయి. ఇక నువ్వే సర్పంచ్.. నీకు తిరుగులేదు అంటూ.. పొడగ్తలతో ఆశావహులను ఆకాశానికి ఎత్తి కొందరు జేబులు ఖాళీ చేస్తున్నారు. దీంతో ఎన్నికలయ్యేలోగా.. ఆశావహులు అప్పులపాలు కావా ల్సిందేననే గుసగుసలు వినిపిస్తున్నాయి. మరి ప్రభుత్వం పల్లెపోరు ఎప్పుడు నిర్వహిస్తోందో వేచి చూడాలి.

రైతులను పట్టించుకోని ప్రభుత్వం

- రైతు సంఘం జిల్లా కార్యదర్శి రజనీకాంత్


మాట్లాడుతున్న రజనీకాంత్

చిట్యాల: రైతులను ప్రభుత్వం పట్టిచుకోవడం లేదని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చింతల రజనీకాంత్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని శాంతినగర్ శివారులో ఉన్న సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి రైతులతో మాట్లాడారు. ఆరుగాలం కష్టపడి రైతులు పండించిన పంటలను అమ్ముకుందామంటే కనీసం సీసీఐ పత్తి కొనుగోలు సెంటర్‌లో ఆధార్ సర్వర్ పని చేయకపోవండతో పత్తి కొనుగోలు నిలిచిపోయాయన్నారు. సీసీఐ పత్తి కొనుగోలు సెంటర్‌లో నిలిచిపోయిన సమాచారం తెలియక పత్తిని రైతులు కొనుగోలు సెంటర్‌కు తీసుకొచ్చినట్లు తెలిపారు. దీంతతో ప్రైవేట్ కొనుగోలు దారులకు అతి తక్కువ ధరకు పత్తిని రైతులు అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులపై దృష్టి సారించి సీసీఐ కొనుగోలు కేంద్రాలలో ఆధార్ సాంకేతిక సమస్యను వెంటనే పరిష్కారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పోతనవేణి కుమార్, వాయిలాల రమేశ్, రైతులు శ్రీకాంత్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులకు నష్టం

- బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజేందర్


పనులను పరిశీలిస్తున్న నాయకులు

రేగొండ: ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఎస్సారెస్పీ ఆయకట్టు రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంకం రాజేందర్ ఆరోపించారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న డీబీఎం38 కాల్వ పూడిక తీత పనులను శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో యాసంగి నాట్లకు ముందే చెరువులను ఎస్సారెస్పీ నీటితో నింపేవారన్నారు. కాని కాంగ్రెస్ ప్రభుత్వంలో యాసంగి నాట్లు ముగిశాక నీటిని విడుదల చేసిన, కాలువలు పూడికతో నిండిపోవడంతో చివరి అయకట్టుకు నీరు ఎలా చేరుతుందని ప్రశ్నించారు. రైతుల కోసం చెక్‌డ్యాంలు నిర్మించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిని కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శించడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ సామల పాపిరెడ్డి, బీఆర్‌ఎస్ టౌన్ అధ్యక్షుడు కోలేపాక భిక్షపతి, నాయకులు హింగే మహేందర్, బండి రమేశ్, మైస సంజీవ్, ఎడ్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చిట్యాల: మండలంలోని కాల్వపల్లి మానేరు వాగు నుంచి ఏలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై శ్రావన్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. జడలపేట గ్రామ శివారులో పోలీసులు తనిఖీలు చేస్తుండగా కాల్వపల్లి నుంచి భూపాలపల్లికి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్ డ్రైవర్, ఓనర్ మెట్టు రజనీకాంత్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

లారీల తనిఖీ

మల్హర్: ఓవర్ లోడ్‌తో వెళ్లే ఇసుక లారీలను అదుపు చేయడానికి చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసినట్లు కొయ్యూరు ఎస్సై నరేష్‌గౌడ్ తెలిపారు. మండలంలోని వల్లెకుంట క్రాస్ చెక్ పోస్ట్ వద్ద మంథని-కాటారం వైపు వెళ్లే ఇసుక లారీలను ఆపి వేబిల్లు, వాహన పత్రాలను పరిశీలించారు. చెక్‌పోస్ట్ వద్ద 24 గంటలు నిఘా ఉంటుందని ఎస్సై పేర్కొన్నారు. ఓవర్ లోడ్‌తో ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో భాగంగా గురువారం రాత్రి ఓవర్ లోడ్‌తో వెళ్తున్న ఇసుక లారీని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు.

విజయాలపై అధ్యయనం

గీసుకొండ : జాతీయ ఆదర్శ గ్రామంగా గుర్తింపు పొందిన మండలంలోని గంగదేవిపల్లి సాధించిన విజయాలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం జిల్లాకు స్వచ్ఛంద సంస్థల సభ్యులు శుక్రవారం అధ్యయనం చేశారు. అనంతపురం జిల్లాకు చెందిన రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఎన్‌జీఓ)లో కల్యాణదుర్గం రీజియన్‌లో పని చేస్తున్న పలు మండలాలు, గ్రామాలకు చెందినవారు గంగదేవిపల్లి గ్రామాన్ని సందర్శించారు.

వన దేవతలకు మొక్కులు


ఏటూరునాగారంలో సదాలమ్మ వద్ద భక్తుల సందడి


కన్నాయిగూడెం: జాతరలో పాల్గొన్న భక్తులు

- మినీ జాతరకు తరలివచ్చిన భక్తులు
- నేడు అమ్మవార్లు వనంలోకి వెళ్లడంతో జాతర ముగింపు

కన్నాయిగూడెం: మండలంలోని ఐలాపూర్ మినీ జాతరకు భక్తులు శుక్రవారంఅధిక సంఖ్యలో వచ్చి వనదేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. పలు మండలాలు, జిల్లాల ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాలలోని నాయకపోడులు లక్ష్మీదేవరతో వచ్చి సమ్మక్క సారక్కలకు మొక్కులు చెల్లించారు.

కొండాయిలో..

ఏటూరునాగారం: కొండాయి గ్రామంలో గోవిందరాజులు, నాగులమ్మ, సారలమ్మలకు శుక్రవారం భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. గద్దెలపైకి గురువారం రాత్రి చేరుకున్న వనదేవతలకు భక్తులు తరలివచ్చి శుక్రవారం కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. శనివారం సాయంత్రం వనదేవతలకు వన ప్రవేశం చేయడంతో మినీ జాతర ముగుస్తుందని గోవిందరాజుల పూజారులు దబ్బగట్ల గోవర్ధన్, రాజారాం, రఘు తెలిపారు. సారలమ్మ పూజారి కాక వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


ఏటూరునాగారం: చెల్పాకలో..

సదాలమ్మ గుడి వద్ద మొక్కులు

మండల కేంద్రంలోని ఓడవాడ సమీపంలోని కొలువై ఉన్న సదాలమ్మ గుడివద్ద శుక్రవారం భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అడవిలో నుంచి కంకవనాన్ని తీసుకురావడంతో జాతర ప్రారంభం అయ్యిందని, రెండు రోజులపాటు మొక్కులు చెల్లించి శనివారం సాయంత్రానికి ముగుస్తోందని పూజారులు కొండమళ్ల వరలక్ష్మి తెలిపారు. సమ్మక్క చెట్టు కింద పట్నాలు తొక్కుడు కార్యక్రమాన్ని చేపట్టారు. సమ్మక్క(సదాలమ్మ) పూజారులు, శివసత్తులు కలిసి ఆ పట్నాలను తొక్కి ముగ్గును ఇంటికి తీసుకెళ్లి పూజించుకోవడం ఆనవాయితీగా వస్తుంది.


కొండాయిలో భక్తుల మొక్కులు

చెల్పాకలో మొక్కులు

మండలంలోని బాన్నాజీబంధం, చెల్పాకలోని సమ్మక్క సారలమ్మను శుక్రవారం మేడారం ట్రస్టు బోర్డు చైర్మన్ అరెం లచ్చుపటేల్ నాయకులతో కలిసి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మేడారం ప్రధాన పూజారి సిద్ద బోయిన స్వామి, రవాణాశాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవి, పూజారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

- మండల వ్యవసాయ అధికారి కల్యాణి


సమావేశంలో మాట్లాడుతున్న కల్యాణి

టేకుమట్ల: ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి కల్యాణి అన్నారు. శుక్రవారం మండలంలోని రైతు వేదికలో ఎరువులు, పురుగుమందుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు కొనుగోలు చేసిన మందులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని తెలిపారు. రైతులకు ఈ-పాస్ ద్వారానే ఎరువులను విక్రయించాలని డీలర్లకు సూచించారు. ఎరువులను ఎమ్మార్పీకే అమ్మాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రాహుల్, యోగిత, భరత్, మండల డీలర్లు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

- మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్


పనులను పర్యవేక్షిస్తున్న శ్రీనివాస్

భూపాలపల్లి రూరల్: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని కాలనీల్లో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. ప్రధాన రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన మట్టిని సంబంధిత సిబ్బందితో తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన రోడ్డు ఇరువైపులా ఎటువంటి చెత్తా చెదారం లేకుండా చూసుకోవాలన్నారు. పట్టణంలో ఆరో ఇన్‌క్లైన్ రోడ్, కృష్ణ కాలనీలోని ఫికల్ స్లడ్జ్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను పరిశీలించి ప్లాంట్‌ను త్వరగా పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణంలో నీటి కొరత రాకుండా చూసుకోవాలన్నారు. అలాగే పట్టణంలో వీధిలైట్లు సమయపాలనతో వెలిగేలా చూడాలని తెలిపారు.

బూర్నపల్లి చోరీపై పోలీసుల ఆరా


ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

టేకుమట్ల: మండలంలోని బూర్నపల్లిలో కొండ మొగిళి ఇంట్లో గురువారం జరిగిన చోరీ సంఘటన విదితమే. కాగా, శుక్రవారం క్లూస్ టీం, టాస్క్ ఫోర్స్ బృందాలు రంగంలోకి దిగి ఆధారాలు సేకరించారు. పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి నిందితుల వేటలో ఉన్నట్లు సీఐ మల్లేశ్ యాదవ్, ఎస్సై దాసరి సుధాకర్ తెలిపారు. సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు వేగవంతం చేసినట్లు తెలిపారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామన్నారు. గ్రామాల్లో జరిగే దొంగతనాలపై ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లోని ప్రధాన కూడలీలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే దొంగతనాలు, ఇతర సంఘటనల కేసులను చేధించడంలో సీసీ కెమెరాలు పని చేస్తాయన్నారు.

ఎస్సీ వర్గీకరణ పేరుతో మోసం


టేకుమట్లలో బంద్ చేయించిన మాల మహానాడు నాయకులు


భూపాలపల్లి రూరల్: మాట్లాడుతున్న నాయకులు

- మాల మహానాడు మండల అధ్యక్షుడు ఓదేలు

టేకుమట్ల: ఎస్సీ వర్గీకరణ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం మాలలను మోసం చేస్తుందని మాల మహానాడు మండల అధ్యక్షుడు కొండ్ర ఓదేలు అన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా తెలంగాణ రాష్ట్ర మాల మహానాడు ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర బంద్‌కు పిలునిచ్చారు. ఈ నేపథ్యంలో మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు కొండ్ర ఓదేలు ఆధ్వర్యంలో వ్యాపారస్తుల షాపులు, విద్యా సంస్థలను బంద్ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ పేరుతో మోసం చేస్తుందని అన్నారు. ఓకే వర్గానికి చెందిన వారికి న్యాయం చేసే విధంగా వర్గీకరణను సూచిస్తుందని అన్నారు. రాజకీయ లబ్ధికోసం వర్గీకరణను శాస్త్రీయంగా చేయకుండా మాలలకు ఐదు శాతం రిజర్వేషన్ ఇవ్వడం అన్యాయం అన్నారు. రాజకీయ స్వార్థం కోసం మాల మాదిగల మధ్య చిచ్చు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాలలకు ఎనమిది శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు మండల నాయకులు బండెల నరేష్, బట్టల మొగిలి, గంధం కృష్ణయ్య, సారయ్య, భూపెల్లి రవీందర్, భాస్కర్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లి రూరల్: తెలంగాణ మాల జేఏసీ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన ఎస్సీ వర్గీకరణ తీర్మానానికి వ్యతిరేకంగా శుక్రవారం జిల్లా బంద్‌కు సహకరించిన వాణిజ్య వ్యాపార, విద్యాసంస్థలకు, ప్రజలకు తెలంగాణ మాల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పొనగంటి మధుకర్, జేఏసీ జిల్లా నాయకుడు జోగుల సమ్మయ్య కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో చేసిన కులగణన ఎస్టీ, ఎస్సీ, బీసీ షమీం అక్తర్ కమిషన్ ఇచ్చినటువంటి సర్వే పూర్తిగా తప్పుల తడక అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, మందకృష్ణ మాదిగ ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసిన ఎస్సీ వర్గీకరణ జరగదని తెలిపారు. కార్యక్రమంలో అశోక్, బండ్ల పెల్లి అశోక్, భిక్షపతి, సంతోష్, లక్ష్మీనారాయణ, శతక ప్రవీణ్, సమ్మయ్య, మహర్షి, అశోక్ పాల్గొన్నారు.

పశుగణన త్వరగా పూర్తిచేయాలి


మెట్‌పల్లిలో టీకాలు వేస్తున్న అధికారులు

కాళేశ్వరం: జిల్లాలో జరుగుతున్న 21వ పశుగణనను త్వరగా పూర్తిచేయాలని జిల్లా పశుసంవర్ధక, పశువైద్యాధికారి అసోడా కుమారస్వామి అన్నారు. జిల్లా నోడల్ అధికారి డాక్టర్ జీ.వెంకన్నతో కలిసి పూస్కుపల్లి, మజీద్‌పల్లి, కాళేశ్వరం, మెట్‌పల్లి, సురారం గ్రామాలను శుక్రవారం కుమారస్వామి సందర్శించారు. కాళేశ్వరం గ్రామంలో ప్రైమరీ వెటర్నరీ సెంటర్‌కు శాశ్వత భవనం సదుపాయంపై చర్చించారు. భవన నిర్మాణంతో పశువైద్య సేవలు మెరుగుపడటంతో పాటు పశువుల ఆరోగ్య సంరక్షణకు మరింత సహాయపడుతుందని తెలిపారు. మహదేవపూర్ ప్రైమరీ వెటర్నరీ సెంటర్‌లో సమీక్ష సమావేశం ఏర్పాటుచేసి మండలంలోని పశువైద్య సిబ్బందితో కలిసి పలు అంశాలను సమీక్షించారు. రికార్డుల తనిఖీ, వివిధ పథకాలకు సంబంధించిన డాక్యుమెంటేషన్ పరిశీలించారు. సూరారం గ్రామంలోని సబ్‌సెంటర్ ఏహెచ్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది గైర్హాజరు గురించి వాకబు చేశారు. పౌల్ట్రీ రంగంలో బర్డ్‌ఫ్లూ విస్తరణను అరికట్టేందుకు అధిక అప్రమత్తత అవసరమని చెప్పారు. అనుమానిత కేసులు ఉంటే వెంటనే సమాచారం అందించాలని సూచించారు. వారివెంట మహదేవపూర్ పశువైద్యాధికారి బుర్ర రాజబాబు ఉన్నారు.

డీఎన్ఆర్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

- జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని


పురస్కారాలను అందిస్తున్న ప్రతాప్‌రెడ్డి

ములుగు రూరల్: డీఎస్‌ఆర్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని అన్నారు. మల్లంపల్లి మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రతిభావంతులైన విద్యార్థులకు డీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందించారు. ఈ మేరకు శుక్రవారం నపాఠశాల ప్రధానోపాధ్యాయుడుయ వజ్జ తిరుపతి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి డీఈఓ పాణిని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఐఐటీ బాసర సీట్లు సాధించిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందించినట్లు తెలిపారు. అనంతరం ట్రస్టు అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు చేయూతనందిస్తామని అన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ


గోవిందరావుపేట: సాయం అందజేస్తున్న ఎస్సై

గోవిందరావుపేట: మండలంలోని పస్రాలో ఇటీవల బొల్ల అశోక్ కిరాణా షాపు షార్ట్ సర్క్యూట్‌తో కాలి రూ.10 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. దీంతో బాధిత కుటుంబానికి పస్రా ఎస్సై కమలాకర్ రూ.5,000 సాయంతోపాటు 50 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు.

ములుగు రూరల్: మండలంలోని పంచోత్కులపల్లి గ్రామానికి చెందిన కల్లెం కొమురమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు.